


సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం క్రిస్మస్ కానుకలు ఇవ్వడం లేదు

● కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ కానుకలను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని వెంకటేశ్వరనగర్ కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఆరోపించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో అదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్రిస్మస్‌ను అధికారిక పండుగగా గుర్తించడంతో పాటు కానుకలు అందించినట్లు తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం క్రిస్టియన్‌లను విస్మరించిందని ఆరోపించారు.



హౌసింగ్ సొసైటీ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు యూసుఫ్‌వుద్దీన్

సొసైటీ సభ్యులందరికీ ఇళ్ల స్థలాలిస్తాం

● ఎన్‌ఆర్‌ఆర్‌పురం హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు

బోరబండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఆర్‌ఆర్‌పురం హౌసింగ్ సొసైటీలోని సభ్యులందరికీ ఇంటి స్థలం వచ్చేలా కృషి చేస్తామని సొసైటీ అధ్యక్షుడు షేక్ యూసుఫ్‌వుద్దీన్ అన్నారు. సైట్-3 ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ కమ్యూనిటీ హాల్‌లో సొసైటీ సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ అధ్యక్షుడు అంజయ్యకు నివాళులర్పించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమామ్ గోరి, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎల్లయ్య, సత్యనారాయణ, అక్తర్ సుల్తానా, అమృత, రాంమోహన్‌రావు, హైమాద్ అలీ, సత్తాజీ, సాయినాథ్, రహ్మాన్, దేవరాజ్, ఖలీంవుద్దీన్, వేణుగోపాల్ సింగ్ పాల్గొన్నారు.

పీవీ రావు ఆశయాలను కొనసాగిస్తాం

బోరబండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీ రావు ఆశయాలతో దళిత ఉద్యమాలను నిర్వహిస్తామని అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైభీమ్ యాదగిరి, పవనం శివశంకర్ అన్నారు. పీవీ రావు 19వ వర్ధంతిని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దశరథం, తిరుపతి, సంపత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



సీఎం కప్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించిన హర్షవర్ధన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

బాక్సింగ్‌లో ఖైరతాబాద్ బాలుడి సత్తా

ఖైరతాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ డబుల్ బెడ్రూం నివాసి తోడేటి హర్షవర్ధన్ (17) బాక్సింగ్‌లో వరుస విజయాలు సాధిస్తున్నాడు. నెల రోజుల క్రితం జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక కాగా.. శనివారం ఎల్బీ స్టేడియంలో జరిగిన సీఎం కప్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. అజయ్‌కుమార్, మంగ దంపతుల కుమారుడైన హర్షవర్ధన్ ఇంటర్ స్థాయి పోటీల్లో సైతం బంగారు పతకం సాధించాడు. డబుల్ బెడ్రూం సముదాయాల అసోసియేషన్ అధ్యక్షుడు డీబీ అనిల్ ఆదివారం బాలుడిని సత్కరించారు.

నిషేధిత సమయంలో నగరంలోకి లారీ.. కేసు నమోదు

బంజారాహిల్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిషేధిత సమయంలో నగరంలోకి ప్రవేశించిన లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి శ్రీనగర్‌కాలనీలో విధులు నిర్వహిస్తుండగా నిషేధిత సమయంలో ఓ లారీ వచ్చింది. దీనివల్ల ట్రాఫిక్‌కు ఆటంకాలు ఏర్పడటంతో గోవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శాంతిభద్రతల పోలీసులు లారీ డ్రైవర్ అబ్దుల్ నజీర్‌పై కేసు నమోదు చేశారు.

ఆయుర్వేదంతో మాతృత్వ సిద్ధి

● ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యుల భరోసా
● సంతానలేమికి ఆయుర్వేద వైద్య విధానంలో ఎన్నో పరిష్కారాలు
● ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడి

ఎర్రగడ్డ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాతృత్వపు వరాన్ని పొందేందుకు ప్రతి స్త్రీ తపిస్తుంది. వివాహం అయ్యి ఏళ్లు గడుస్తున్నా గర్భం రాకపోతే వారిలో ఆందోళన మొదలవుతుంది. తెలియకుండానే ఒత్తిడికి లోనవుతుంటారు. దీనివల్ల సంతాన సాఫల్యం మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. అయితే గర్భం దాల్చకపోవడానికి గల కారణాలను తెలుసుకుని అవసరమైన చికిత్స తీసుకుంటే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. మహిళలను అధికంగా వేధించే సమస్య సంతాన లేమి. ఆయుర్వేద భాషలో దీనికి వంధ్యా అంటారు. సాధారణంగా సంతానం కలగకపోవడానికి దంపతులిద్దరిలో ఎవరైనా కారణం కావచ్చు. ఈ క్రమంలో సంతానలేమికి ఆయుర్వేద వైద్య విధానంలో చక్కని పరిష్కారాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. సంతానలేమి సమస్య ఉన్నవారు ఆయుర్వేద వైద్య విధానంతో 70 నుంచి 80 శాతం వరకు ఫలితాలను పొందవచ్చని వెల్లడిస్తున్నారు. ఎర్రగడ్డ ఆయుర్వేద వైద్యశాలలో చికిత్స తీసుకున్న ఎంతో మందికి సంతానం కలిగినట్లు ఆస్పత్రి వైద్యులు పేర్కొంటున్నారు.

సంతానలేమికి ప్రధాన కారణాలు..

సాధారణంగా సంతాన లేమికి స్త్రీలకు సంబంధించిన కారణాల్లో పుట్టుకతోనే గర్భాశయ ఆకృతుల్లో మార్పులు ఉండటం ఒకటి. గర్భాశయ ముఖద్వారం చిన్నదిగా ఉండడం, అండాలు విడుదల కాకపోవడం, అండాశయం పనితీరులో తేడాలు, గర్భాశయ వాహికకు ట్యూబ్స్ పనితీరులో తేడాలు, బహిష్టు క్రమం తప్పడం వంటి పలు కారణాలు ఉంటాయి. అయితే మహిళలతో పాటు పురుషుల్లోనూ పలురకాల సంతాన లేమి సమస్యలు ఉంటాయి.



ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి

పరిష్కారాలు..

గర్భం రాకపోవడానికి గల కారణాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా ఆయుర్వేద విధానంలో వైద్యులు చికిత్స ప్రారంభిస్తారు. అవసరమైన మందులు తీసుకోవడం, ఆహారంలో మార్పులు వంటివి చికిత్సలో ప్రధానంగా ఉంటాయి. పాలు, నెయ్యి, తేనె, పండ్లు, అశ్వగంధ, అతిమధురం, స్వర్ణభస్మం, రజత భస్మం వంటివి ప్రధానంగా వాడతారు. గర్భాశయ నాళాల్లోని అవరోధాలు తొలగించడానికి ఉత్తరవస్తిం చికిత్స చేస్తారు. ప్రత్యేక పద్ధతుల్లో తయారు చేసిన ఔషధసిద్ధ తైలాలను గర్భాశయం లోపలి ముఖద్వారం వరకు ఇంజెక్ట్ చేస్తారు. ఈ విధానంలో ఔషధాలను తైలం లేదా నెయ్యితో తయారుచేస్తారు. మానసిక ఒత్తిడికి గురయ్యే వారిలో బహిష్టులో తేడాలు వస్తాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి శిరోధర చికిత్స చేస్తారు. ఆయుర్వేద విధానంలో సంతానం కలగడానికి అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు.

ఎర్రగడ్డ ఆస్పత్రిలో అందించే వైద్య సేవలు..

సంతానం లేని వారికి ఆధునిక చికిత్స విధానాలు ఎర్రగడ్డ ఆయుర్వేద ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. గర్భం దాల్చిన అనంతరం ప్రతి నెలా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారు. దీంతో పాటు గర్భాశయంలో పిండం ఎదుగుదలకు, గర్భిణుల్లో లక్షణాలకు అనుగుణంగా ఆహారం విషయంలో జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సంబంధిత వైద్య నిపుణులు సూచనలు చేస్తారు.

ఆయుర్వేదంతో మాతృత్వాన్ని ఆస్వాదించవచ్చు



మాతృత్వం అనేది ఒక వరం. సంతాన లేమికి ఆయుర్వేద వైద్యం విధానంలో మంచి పరిష్కారం లభిస్తోంది. ఇతర వైద్య విధానాలు, ఔషధాలు ఉపయోగించకుండానే కేవలం ఆయుర్వేద వైద్యం ద్వారా సంతానం కలిగించడం మాత్రమే కాకుండా ఐయూఐ, ఐవీఎఫ్ వంటి కృత్రిమ గర్భధారణ పద్ధతులు విఫలం అయిన వారికి కూడా మంచి ఫలితాలను ఇవ్వగలుగుతున్నాం. ఆయుర్వేద వైద్య విధానం ద్వారా సంతాన లేమికి ఎటువంటి శస్త్ర చికిత్సలు అవసరం లేకుండా, దుష్ప్రభావాలకు లోను కాకుండా మంచి చికిత్స అందించి సంతానభాగ్యం కల్పిస్తాం.

– డాక్టర్ యశోద పెనుబాల, ప్రసూతి, స్త్రీల వైద్యనిపుణులు, ఎర్రగడ్డ ఆయుర్వేద ఆస్పత్రి

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● కోట నీలిమ

బేగంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. మైనార్టీ మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత కుట్టు మెషీన్ల పథకానికి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం బేగంపేటలో ఆదివారం ప్రారంభమైంది. బేగంపేట కాంగ్రెస్ సీనియర్ నేత విశాల్ సుధాం ఆధ్వర్యంలో పాటిగడ్డ, ఓల్డ్ కష్టమ్స్ బస్తీల్లో దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. కోట నీలిమ మట్లాడుతూ.. మహిళలకు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. అర్హత ఉన్న ప్రతీ మహిళకు కుట్టు మెషీన్లు అందించేందుకు కృషి చేస్తామన్నారు. విశాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హనీఫ్‌ఖాన్, నజీర్, నవాజ్, రమేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోట నీలిమ

ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం

అమీర్‌పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలో ఏర్పాటు చేసిన కళా ఆర్ట్ గ్యాలరీని కోట నీలిమ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళారంగానికి చెందిన పలువురు ప్రముఖులు, యువ కళాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. కళలను ప్రోత్సహించడం, యువతకు కొత్త అవకాశాలు కల్పించడం చేయాలన్నారు.



ప్రదర్శనలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.సునీత

శ్రీనగర్‌కాలనీలో చేనేత వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఏర్పాటు చేసిన ఆరు రోజుల చేనేత వస్త్ర ప్రదర్శన-2024ను ఆదివారం ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.సునీత, చేనేత, జౌళిశాఖ, కమిషనర్ రేఖారాణి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. ఏపీ చేనేత పరిశ్రమ తరతరాలుగా గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉందన్నారు. రాష్ట్రంలోని 35 రకాల చేనేత ఉత్పత్తులు మంచి గుర్తింపు పొందాయన్నారు. ఉప్పాడ జమధాని, మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం సిల్క్ చీరలు, పావడలు భౌగోళిక గుర్తింపు పొందినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులు సాంస్కృతిక, కళాత్మక సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. చేనేత, జౌళిశాఖ, ఏపీ కమిషనర్ రేఖారాణి మాట్లాడుతూ.. ఈ నెల 27 వరకు కొనసాగనున్న ప్రదర్శనలో ఎన్నోరకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న శ్రీదేవి విజయ దాస్

కళింగ కల్చరల్ హాల్‌లో జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను ఆదివారం హస్తకళా ఆర్టిషన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీదేవి విజయ దాస్ ప్రారంభించారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని శ్రీదేవి విజయ దాస్ అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. నేటి తరం యువత సైతం హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఆదరిస్తున్నారని, ప్రతి ఒక్కరూ చేనేతకారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 29 వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు 75 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచుతారన్నారు.



పీవీ రావు, జి.వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమంలో చెన్నయ్య తదితరులు



జి.వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేక్, ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకులు మధుకర్‌యాదవ్, ఆవుల అనిల్‌కుమార్ తదితరులు

పేదల అభివృద్ధికి వెంకటస్వామి పరితపించారు

● మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

ఖైరతాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసి చివరి శ్వాస వరకు అంబేడ్కర్ ఆశయాల కోసం జి.వెంకటస్వామి (కాక), పీవీ రావు పనిచేశారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన గడ్డం వెంకటస్వామి, పీవీ రావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చెన్నయ్య మాట్లాడుతూ.. పేదలకు కూడు, నీడ అందించాలని అనునిత్యం కాక పరితపించారని, 70 వేల కుటుంబాలకు గుడిసెలను వేయించి గుడిసెల వెంకటస్వామిగా పేరు గాంచారన్నారు. సింగరేణి కార్మికుల బతుకుల్లో వెలుగై నిలిచారని, డాక్టర్ అంబేడ్కర్ పేరిట విద్యా సంస్థలు స్థాపించి లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చివరి వరకు పీవీ రావు పోరాడరని, మాలల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు.

తెలంగాణ సాధనకు నిరంతర కృషి

యూసుఫ్‌గూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి గడ్డం వెంకటస్వామి అని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్, పులిరామ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ హత్య కేసులో వీడిన మిస్టరీ

● కుమార్తెను ట్రాప్ చేశాడనే కక్షతో హత్య చేసిన దంపతులు

బోరబండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ అదృశ్యం కేసులో మిస్టరీ వీడింది. తమ కుమార్తెను కిడ్నాప్ చేశాడనే కక్షతో ఆ బాలిక తల్లిదండ్రులు అతడిని హత్య చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. కృష్ణాజిల్లా మైలవరానికి చెందిన ఓ వ్యక్తి కొంత కాలం క్రితం జగద్గిరిగుట్టకు వలస వచ్చి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయన కుమార్తెకు ఇన్‌స్టాగ్రాం ద్వారా నిజాంపేటకు చెందిన ఆటో డ్రైవర్ కుమార్ (30) పరిచయమయ్యాడు. ఆమెకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి యూసఫ్‌గూడలోని ఓ గదిలో నిర్బంధించాడు. ఆమెపై లైంగికదాడికి యత్నించగా ఆమె తప్పించుకుంది. తల్లిదండ్రులు బాలిక ల్యాప్‌టాప్‌లో చూడగా కుమార్ ఆమెను కిడ్నాప్ చేశాడని గుర్తించారు. బోరబండ సైట్-3కి వచ్చి కుమార్‌కు వేరే వారితో ఫోన్ చేయించారు. మియాపూర్ మెట్రో స్టేషన్ వద్దకు వస్తే మాట్లాడదామని నమ్మించారు. వారి మాటలు నమ్మి అక్కడికి రావడంతోనే భార్యాభర్తలు కుమార్‌పై దాడి చేశారు. దీంతో అతడు స్పృహ తప్పి పడిపోవడంతో కారులో తీసుకెళ్లి నాగార్జునసాగర్ ఎడమ కాలువలో రాళ్లు కట్టి పడేశారు. అయితే ఆటోపై ఉన్న చలాన్ ఆధారంగా బోరబండ పోలీసులు నిందితులను గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా కుమార్‌ను హత్య చేసినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థి మృతి కేసులో బస్ డ్రైవర్ అరెస్ట్

పంజాగుట్ట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందిన కేసులో ప్రైవేట్ బస్ డ్రైవర్‌ను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన పుణ్ణం లోకేష్ (21) బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఈ నెల 12న స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై కళాశాలకు వెళుతుండగా అమీర్‌పేట స్మార్ట్ బజార్ వద్ద వెనుక నుంచి వచ్చిన ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ లోకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆదిలాబాద్‌కు చెందిన బస్సు డ్రైవర్ ఓం ప్రకాష్(36)ను ఆదివారం అరెస్టు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

పంజాగుట్ట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను అమిత్ షా వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంబేడ్కర్ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ చరిత్రపుటల నుంచి ఆయన పేరును, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన చేసిన కృషిని తుడిచివేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా తమ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఈ నెల 24న దేశవ్యాప్త ధర్నాకు పిలుపునిచ్చారని, రాష్ట్రంలో ఆ రోజు ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమన్వయకర్త బి.ఈశ్వర్, బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు

ఎంబీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

● బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు

పంజాగుట్ట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓట్లేసి గెలిపిస్తే అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి ఎంబీసీల గురించి ఒక్క మాటైనా మాట్లాడకపోవడం శోచనీయమని జాతీయ ఎంబీసీ, డీఎన్‌టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు నర్సింహ సాగర్, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సంఘం నాయకులు సత్యం వంశరాజ్, ప్రొఫెసర్ ఓర్స్ కృష్ణయ్య తదితరులతో కలిసి వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని అప్పటి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా తమను పట్టించుకోవడం లేదన్నారు. ఒక సినిమా హీరో గురించి గంటసేపు అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యేలు, సీఎం.. జనాభాలో 30 శాతం పైగా ఉన్న ఎంబీసీల గురించి మాట్లాడలేదని విమర్శించారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, పూర్తి స్థాయిలో పాలకమండలిని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. జనవరి 12న నగరంలో ఎంబీసీ, డీఎన్టీ, అట్టడుగు వర్గాల సదస్సు నిర్వహించి సమస్యలపై చర్చిస్తామని వారు వెల్లడించారు.



రన్‌లో పాల్గొన్న యువతీ యువకులు

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు రన్

రాంగోపాల్‌పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సహారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సంజీవయ్య పార్క్ నుంచి జలవిహార్ వరకు 10 కే, 5కే, 3కే రన్ నిర్వహించారు. రన్ ఫర్ తోసే హరా గన్ టూ పేరిట నిర్వహించిన ఈ పరుగులో కాళ్లు, చేతులు లేని వారితో పాటు దివ్యాంగులను ప్రోత్సాహించేందుకు యువతి, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ శంకర్ మాట్లాడుతూ.. ఇతరులతో పోటీ పడేందుకు దివ్యాంగులల్లో ఎన్నో అవరోధాలు ఉంటాయని, తమ ఫౌండేషన్ ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారిని ఈ విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు.



బీసీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, పరుపులు పంపిణీ చేస్తున్న తుకారాంగేట్ పోలీసులు

విద్యార్థులు బాగా చదువుకోవాలి

- సీఐ శంకర్ నాయక్

అడ్డగుట్ట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు బాగా చదువుకోవాలని తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ మహేంద్రాహిల్స్‌లో ఉన్న బీసీ హాస్టల్ విద్యార్థులకు పడుకునేందుకు పరుపులు, దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు బాగా చదువుకోవాలని ప్రభుత్వం మీలాంటి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ తమ వంతు సాయంగా హైదరాబాద్ యూత్ అసెంబ్లీ ప్రతినిధి రోహిత్ ఆధ్వర్యంలో 100 దుప్పట్లు ఇతర వస్తువులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ ఎస్సై వెంకటేశ్వర్లు సంస్థ ప్రతినిధులు షాబానా, యశోదలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేతకు హరియాణా గవర్నర్ పరామర్శ



బన్సీలాల్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఉమేష్ ఖండేల్వాల్‌ను ఆదివారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. అనారోగ్యంతో పద్మారావునగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉమేష్ ఖండేల్వాల్ వద్దకు దత్తాత్రేయ వెళ్లి కలిశారు. అతడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నాయకులు టి.రాజశేఖర్‌రెడ్డి, కె.హరినాథ్‌నాయి, వై.శ్రీనివాస్, ఎస్.రాజు పాల్గొన్నారు. - (పద్మారావునగర్, ఆంధ్రజ్యోతి)

నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరిన ఇద్దరు మైనర్లు

- ప్రభుత్వ షెల్టర్‌కు తరలింపు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బంధువుల ఇంటికి వెళ్లేందుకు నాంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఇద్దరు పిల్లలను ఆర్పీఎఫ్ పోలీసులు ప్రభుత్వ షెల్టర్‌కు తరలించారు. నాంపల్లి ఆర్పీఎఫ్ సీఐ కల్పన తెలిపిన వివరాల ప్రకారం బంజారాహిల్స్‌కు చెందిన ఇద్దరు మైనర్లు గుల్బర్గలో ఉంటున్న పెద్దమ్మ ఇంటికి వెళ్లేందుకు మైనర్లిద్దరూ ఆదివారం నాంపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఒంటరిగా ఉన్న ఇద్దరిని పిల్లలను ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. పూర్తి స్థాయిలో విచారించి కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్నారు. వెంటనే హెల్ప్‌డెస్క్ ప్రతినిధికి ఇద్దరు పిల్లల్ని ఆర్పీఎఫ్ పోలీసులు అప్పగించగా ప్రభుత్వ షెల్టర్‌కు తరలించారు. తల్లిదండ్రులు వచ్చాక ఐడీ కార్డులు తీసుకుని పిల్లలను వారికి అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.



బాలురును ప్రభుత్వ ఆశ్రమానికి తరలిస్తున్న హెల్ప్‌డెస్క్ ప్రతినిధి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన తదితరులు

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

బౌద్ధనగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను అవమానపర్చిన కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని హైకోర్టు న్యాయవాది దివాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీతాఫల్‌మండిలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఐదోవారం జ్ఞానమాలను వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది దివాకర్ మాట్లాడుతూ, నిండు పార్లమెంట్‌లో అంబేడ్కర్ అనటం ఫ్యాషన్‌గా మారిందని, కేంద్రమంత్రి అమిత్‌షా వ్యంగంగా మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపర్చాడన్నారు. కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞాన మాల వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు వెంకటమ్మ, శశికళ, పార్వతి, కవిత, స్వాతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉన్న రోడ్డును తవ్వేశారు..

మళ్లీ ఎప్పుడేస్తారు?

- డ్రైనేజీ పైప్‌లైన్ కోసం ఏడాది క్రితం తవ్వకాలు
- పైప్‌లైన్ పూర్తయినా ప్రారంభం కాని రోడ్డు పనులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

అడ్డగుట్ట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని అడ్డగుట్ట డివిజన్‌లో ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. తుకారాంగేట్‌లోని నందనార్‌నగర్ బస్తీలో (గణపతి ఆలయం) రెండు సంవత్సరాల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడిపోతున్నారు. రోడ్డును తవ్వి ఏడాదైనా పనులు చేయకపోవడంపై కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు డివిజన్ పరిధిలో కంకరతేలిన రోడ్ల విషయంపై స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు కంకరరాళ్లపై నడవలేక కిందపడిపోయి గాయాలపాలవుతున్నారని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదాలు జరగకుండా తాత్కాలికంగా మట్టి పోసిన స్థానికులు



గణేష్ ఆలయం పక్కన పైప్‌లైన్ పనులు పూర్తయిన తర్వాత రోడ్డు వేయకుండా వదిలేసిన దృశ్యం



నందనార్‌నగర్‌లో కంకర తేలిన రోడ్డు

సీసీ రోడ్డు వేయండి



మంచిగా ఉన్న రోడ్డును తవ్వి రెండేళ్లవుతున్నా కొత్త రోడ్డు వేయలేకపోయారు. ఈ ప్రాంతంలో దుకాణాలు, స్కూళ్లు, వారంతపు సంతలు ఉన్నప్పటికీ ప్రజలు ఈవైపు రావాలంటే భయపడుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి.

- సుమలత, బీఎస్పీ నాయకురాలు

అధికారులు స్పందించాలి



డ్రైనేజీ పైప్‌లైన్ కోసం ఉన్న రోడ్డును తవ్వారు. పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఏడాది అవుతున్నా సీసీ రోడ్డు వేయలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఇక్కడ పనులు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- మహేష్, బస్తీ నాయకుడు

ప్రజలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే శ్రీగణేశ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడుపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని 15 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలందరికీ ఆరోగ్యం, చికిత్స అందుబాటులో ఉండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్‌బాడ్మింటన్ టోర్నీని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

తిరుమలగిరి డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని కంటోన్మెంట్ పబ్లిక్ గార్డెన్ గ్రౌండ్‌లో బొల్లారం బాల్‌బాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అర్జునరావ్ మెమోరియల్ ఒక రోజు బాల్‌బాడ్మింటన్ టోర్నమెంటును ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆదివారం ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాపోటీలను ప్రోత్సహిస్తోందని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. బాల్‌బ్యాడ్మింటన్ క్రీడను ప్రోత్సహించడానికి అవసరమైన సహకారం అందిస్తామని క్రీడాకారులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆటల పోటీలు మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఆరోగ్యమైన వ్యక్తులతోనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సీబీఎన్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

సికింద్రాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చెప్పింది చేసి చూపిస్తామని.. చేసేదే చెప్తామని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆదివారం బస్తీబాట కార్యక్రమంలో భాగంగా కంటోన్మెంట్ రెండోవార్డు సీబీఎన్ నగర్‌లో బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, గతంలో బస్తీబాట కార్యక్రమంలో సీబీఎన్ నగర్‌లో పర్యటించినప్పుడు ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య ఉందని తెలుసుకుని దానిని పూర్తి చేసినట్లు తెలిపారు. నాడు స్థానికులకు ఇక్కడ సీసీ రోడ్డు నిర్మిస్తానని మాట ఇచ్చానని, ఇప్పుడు ఆ మాట ప్రకారం సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు మాటమీద నిలబడతారని, నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజలతో మమేకమై ఉంటారని, ఉచిత హామీలు ఇచ్చి చేతులు దులుపుకుపోయేవారం కాదన్నారు. తమ సమస్య తీర్చినందుకు స్థానికులు రామకృష్ణను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. వార్డు 2 బీజేపీ అధ్యక్షుడు మదారపు అశోక్, నాయకులు శేఖర్, ఆనంద్‌చారి, మహేష్, విజయ్, నరేందర్, హన్మంతు, కేబుల్ శ్రీను పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

నీటి బిల్లులు మాఫీ జరిగేలా కృషి

మారేడుపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోని పేదలు భయపడాల్సిన అవసరం లేదని, నల్లా బిల్లులు మాఫీ చేసేందుకు బీజేపీ తరఫున కృషి చేస్తామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ అన్నారు.

ఆదివారం కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు పరిధిలోని కాకగూడలోని బాలాజీ కాలనీలో స్థానికులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో నీటి సమస్య ఉందని, తమకు సరిపడేంత నీళ్లు సరఫరా చేయడం లేదని, కానీ నీటి కోసం డబ్బులు కట్టాలని నోటీసులు ఇస్తున్నారని కాలనీ వాసులు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వంద వైఖరితో కంటోన్మెంట్ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సరిపడేంత నీరు ఇవ్వమని అడిగితే నీళ్లు వాడుకున్నందుకు డబ్బులు కట్టాలని ఇంటింటికీ బిల్లులు ఇచ్చేలా కంటోన్మెంట్ బోర్డుపై ఒత్తిడి చేస్తోందని ఆరోపించారు. కంటోన్మెంట్‌కు ఉచిత నీటి సరఫరాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యూటర్న్ తీసుకోవడం దారుణమన్నారు . రాష్ట్ర ప్రభుత్వంపై జంగ్ సైరన్ మోగించి నీటి కోసం పోరాటం చేస్తామన్నారు.

జీడీప కోర్సులో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

రాంగోపాల్‌పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టాటాస్ట్రైవ్ వారి సౌజన్యంతో బొల్లినేని మెడి స్కిల్స్ అధ్వర్యంలో జీడీప కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు ఆ సంస్థ ఎగ్జికూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వర రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు చేయడానికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన 20 నుంచి 35 ఏళ్ల వయస్సు లోపు వారు అర్హులని, మూడు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న పూర్తి వివరాలకు 8247255859 నెంబర్‌ను సంప్రదించాలని లేదా బొల్లినేని మెడి స్కిల్స్, నాలుగో అంతస్తు, ప్యారడైజ్ తేజ బ్లాక్, పాత కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి క్యాంపస్ పక్కన, సికింద్రాబాద్‌లో తమ పేర్లను నమోదు చేయవచ్చన్నారు.



నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుగుప్తా సంఘం సభ్యులు

పేద వైశ్యులను ఆదుకోవాలి: ప్రభుగుప్తా

అడ్డగుట్ట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేద వైశ్యులను ఆదుకునేందుకు అన్ని సంఘాలు ఐక్యంగా కలిసి ముందుకు రావాలని బీజేపీ అధికార ప్రతినిధి గురుస్వామి, ప్రభుగుప్తా సూచించారు. ఆదివారం అడ్డగుట్టలోని ఆర్యవైశ్య సంఘం తుకారాంగేట్ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు నాగబండి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో కొంత స్థలం ఉందని ఇక్కడ కన్యాకాపరమేశ్వరి ఆలయం నిర్మించునేందుకు వైశ్యులుగా వైశ్య సంఘాలుగా ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా పేద వైశ్యులను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మల్లవేలు శ్రీకాంత్, నాగబండి శ్రీనివాస్, తల్లెం వెంకటేష్, తొడపనూరి లక్ష్మణ్, మాజీ అధ్యక్షులు ఎల్లంకి వీరేశం, నాగబండి సుధాకర్, కందుకూరి గణేష్‌రావు, కొడారపు శివకుమార్, కొడారపు శ్రీనివాస్, కొడారపు అశోక్, కర్నకోట శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, పురం జగదీష్, కండె బాలకృష్ణలు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్‌రైల్వే స్టేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన లాలాపేట్ ఏరియాలో ఆదివారం చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ లాలాపేట్ ప్రాంతానికి చెందిన దూడల వెంకటేష్(45) డీటీపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. భార్య ముగ్గురు పిల్లలున్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తీవ్ర మనోవేదనకు గురైన ఆయన ఆదివారం లాలాపేట్ డెయిరీ ఫాం వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇంజనీరింగ్ విద్యార్థి మృతి కేసులో బస్ డ్రైవర్ అరెస్ట్

పంజాగుట్ట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందిన కేసులో ప్రైవేట్ బస్ డ్రైవర్‌ను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన పుణ్ణం లోకేష (21) బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఈ నెల 12న స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై కళాశాలకు వెళుతుండగా అమీర్‌పేట స్మార్ట్ బజార్ వద్ద వెనుక నుంచి వచ్చిన ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ లోకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా ఆదిలాబాద్‌కు చెందిన బస్సు డ్రైవర్ ఓం ప్రకాష్(36)ను ఆదివారం అరెస్టు చేశారు.

మెట్టుగూడ అయ్యప్ప ఆలయంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు



బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్‌లో పడిపూజకు కలశాలను తీసుకెళ్తున్న అయ్యప్ప స్వాములు

చిలకలగూడ, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ అయ్యప్ప ఆలయంలో ఆదివారం మండల మహా పూజా మహోత్సవం పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం అయ్యప్ప నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమ్రోగాయి, భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ మీడియా ఇన్‌చార్జి సునీల్ మాట్లాడుతూ.. అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నామని, నిత్యం భజనలు, కీర్తనలతో పాటు లక్షపుష్పార్చన, లలిత, విష్ణుసహస్ర నామపారాయణంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో 4 వేల మందికి అన్నప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. నవంబర్ 16 నుంచి భోజన వసతి లేని భక్తులకు ఉచిత భోజనం అందజేయనున్నట్లు వివరించారు. డిసెంబర్ 26వ తేది అయ్యప్ప స్వామిని అంబారీపై చిలకలగూడ శివాలయం నుంచి మెట్టుగూడ వరకు ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేపీ రవీంద్రన్, ప్రధాన కార్యదర్శి కేపీసీ నాయర్, కోశాధికారి కెఎన్. గంగాధరన్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో వైభవంగా పడిపూజ

బోయిన్‌పల్లి, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు కమిషన్ ఏజెంట్లు, డీసీఎం, ఆటో, హమాలీ అసోసియేషన్ సంఘాల సహకారంతో బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. స్వాముల అయ్యప్ప నామస్మరణలతో ఈ ప్రాంతం మార్మోగింది. స్వామివారికి మంగళవాయిద్యాల నడుమ పంచామృతాభిషేకం, కుంకుమ, చందన, పసుపు అభిషేకాలతో భక్తిశ్రద్ధలతో పడిపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి పల్లకిసేవతో పాటు నరసింహస్వామి, రాధాకృష్ణుల అవతారాలలో చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడిపూజలో హమాలీ సంఘాలు, మార్కెట్ యార్డు సిబ్బంది, వ్యాపారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బన్సీలాల్‌పేట, బోలక్‌పూర్ అంజనేయస్వామి ఆలయంలో జనకిషోర్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడి పూజలో పాల్గొన్న శాసనసభ్యుడు శ్రీగణేశ్. - పద్మారావునగర్, ఆంధ్రజ్యోతి

హనుమాన్ ఆలయ ప్రాంగణంలో..

అడ్డగుట్ట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్ పహాడి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి అయ్యప్ప భక్తుడు బానుగుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజకు పెద్ద సంఖ్యలో భక్తులు, గురుస్వాములు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అయ్యప్ప పూజలు వైభవంగా నిర్వహించారు.

